క్లుప్తంగా

ఘనంగా సినారె జయంతి



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిర్యాలగూడ : ప్రముఖ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి 94వ జయంతిని మండలంలోని జప్తి వీరప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గుడిపాటి కోటయ్య సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సినారె తన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి యువత సాహిత్య అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మిర్యాలగూడ అర్బన్ : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ల్యాబ్ ద్వారా సేకరించే రక్త పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కేశా రవి పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

మాడుగులపల్లి : మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన బొంగర్ల సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సతీష్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో ప్రధానమంత్రి సురక్షా బీమా తీసుకున్నాడు. దీంతో మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మంగళవారం కుటుంబసభ్యులకు ఎస్‌బీఐ ఆర్‌ఎం శివకృష్ణ బాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక్, రమేష్, చంద్రశేఖర్, వెంకటేష్, నాగయ్య, సైదులు, నాగయ్య, అనిల్‌కుమార్, సైదులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే పట్టాలు ఇవ్వాలి

చందంపేట : మండలంలోని అచ్చంపేట పట్టి గ్రామంలోని సర్వే నంబర్ 50లో నిర్వహిస్తున్న భూ భారతి సర్వేలో అర్హులకు మాత్రమే పట్టాలు ఇవ్వాలని గ్రామ మాజీ సర్పంచ్ జర్పుల లోక్యానాయక్ పేర్కొన్నారు. పక్క గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ భూమి ఉన్నట్లుగా రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి పట్టాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన వారికే పట్టాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అవయవ దానం

చింతపల్లి : మండల పరిధిలోని నేల్వలపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి 12 రోజుల క్రితం అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరగా వైద్యులు బ్రెయిన్ డెడ్ అని తెలపారు. దీంతో కుటుంబ సభ్యులు అవయదానానికి ఒప్పుకున్నారు. వివరాల ప్రకారం చింతపల్లి మండల పరిధిలోని నేల్వలపల్లి గ్రామానికి చెందిన వంపు కొండయ్య(45) గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 12 రోజుల క్రితం బీపీ డౌన్ కావడంతో దేవరకొండ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు హైదరాబాద్ తరలించాలని సూచించారు. దీంతో హైదరాబాదులోని కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కొండయ్య అవయవాలను దానం చేసేందుకు సిద్ధపడటంతో గుండె, కిడ్నీలు, లివర్, రెండు కళ్లు కామినేని ఆస్పత్రికి అందించారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

నిడమనూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించుకోవాలని ఆ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎడ్ల రమేశ్ అన్నారు. మంగళవారం నిడమనూరులో బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షురాలు పెందోటి శిరీషా, కన్వీనర్ ఉషాకిరణ్, కోటేష్, రామలింగం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

పెద్దవూర : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి బీఆర్‌ఎస్ సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని పులిచర్ల గ్రామంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామశాఖ అధ్యక్షుడు లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో చెన్ను సుందర్‌రెడ్డి, పాదిళ్ల శ్రీనివాస్, మెండె సైదులు, దాసరి సైదమ్మ, పుల్లారెడ్డి, వెంకటయ్య, చిరంజీవి, సత్యనారాయణ, ఎల్లయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు 'సఫాయి సురక్ష'

- స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రత్యేక పథకం
- కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిస్థితులపై వివరాలు సేకరణ
- మెడికల్ కిట్లు పంపిణీ చేయనున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో పోగయ్యే చెత్తను ప్రతి రోజు సేకరించి..మురుగు కాలువల్లో పేరుకుపోయే మురుగును తొలగిస్తూ ..పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికులు.. వారు మాత్రం అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో వారికి ఆటు ఆరోగ్యం .. ఇటు సంక్షేమం రెండింటిని వారికి అందించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగానే స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కోసం ‹సఫాయి సురక్ష› పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఈ మేరకు మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల ఆరోగ్య వివరాలను అందజేయాలని ఇప్పటికే మున్సిపల్ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చారు. అధికారులు వాటిని సేకరించే పనుల్లో నిమగ్నం అయ్యారు.

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 276మంది..

మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పూర్తి వివరాలను శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న అధికారులు సేకరించే పనిలో ఉన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో 276 మంది పారిశుద్ధ్య కార్మికులు వున్నారు. వారి పూర్తి వివరాలను సేకరించిన తరువాత కార్మికులకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. సఫాయి సురక్ష పథకం అమలుకు కార్మికుల ఆరోగ్య వివరాలను వారి వద్ద నిక్షిప్తం చేసి ఉంచుతున్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సక్రమంగా వర్తింప చేసేలా శానిటేషన్ విభాగం అధికారులు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతున్నారు. గతంలో మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలను కాంట్రాక్ట్ సంస్థలకు సంబంధించిన ఏజన్సీలు ఇచ్చేవి. అయితే ఆయా ఏజన్సీలు వారికి అందజేసే జీతంలో పీఎఫ్, ఈఎస్‌ఐ కట్ చేసి మిగితా సొమ్మును కార్మికులకు సంబంధించిన అకౌంట్లలో జమ చేసేవారు. వారంతా ఈ ప్రక్రియను నిర్వర్తించారా..? లేదా ? అన్న విషయాలను సైతం అధికారులు ఆరా తీసి వాటిని సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.



రోడ్లపై చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిట్లు..

మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఏటా ప్రభుత్వ పరంగా ఆరోగ్య పరిరక్షణ కిట్లు అందజేసేవారు. అదే మాదిరిగా సఫాయి సురక్ష పథకం ద్వారా కార్మికులందరికీ కచ్చితంగా ఆరోగ్య పరిరక్షణ కిట్లల్లో ఉండే చేతికి గ్లౌజులు, కాళ్లకు పొడవటి బూట్లు తలకు రక్షణ హెల్మెంట్‌లను పంపిణీ చేయనున్నారు. కొంత కాలంగా వీటిని సక్రమంగా అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురయ్యారు. అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. వైద్య శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించి చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు అక్కడే మందులను ఇస్తారు. ఏదైనా వ్యాధి ఉన్నట్లు తేలితే ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించనున్నారు.

కార్మికులకు అవగాహన కల్పిస్తాం



మున్సిపాలిటీలో పని చేస్తు న్న పారిశుద్ధ్య కార్మికులకు సఫాయి సురక్ష పథకాన్ని అమలు చేసేందుకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తాం. వారి ఆరోగ్య వివరాలతో పాటు వారి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధను వహించి ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. కార్మికులందరికీ ఆరోగ్య పరిరక్షణ కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

–వెంకటరమణ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, మిర్యాలగూడ

టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

పెద్దవూర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇద్దరి నుంచి ముగ్గురు టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని తమ సొంత ఖర్చులతో న్యూట్రిషన్ కిట్లను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలవ్యాప్తంగా ఉన్న 30మంది టీబీ వ్యాధిగ్రస్తులకు శరీర రోగ నిరోధక శక్తిని పెంచే న్యూట్రిషన్ కిట్లను వైద్య సిబ్బంది తలా కొంతమందిని దత్తత తీసుకుని తమ సొంత ఖర్చులతో అందించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్ అన్నారు. ఆరు నెలల పాటు న్యూట్రిషన్ కిట్లను అందించనున్నట్లు తెలిపారు. 20 వారాలకంటే ఎక్కువ రోజులు జలుబు, దగ్గు ఉన్నా, రాత్రిపూట అధికంగా చెమటలు పడుతున్నా, ఆకలి తగ్గి, శరీర బరువు తగ్గుతున్నా, తీవ్రమైన అలసట, దగ్గుతో పాటు రక్తం రావడం, చాతిలో తీవ్రమైన నొప్పి రావడం, సాయంత్రం సమయంలో శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కన్పిస్తే టీబీగా గుర్తించాలన్నారు. శరీర రోగ నిరోధక శక్తిని పెంచే ప్రోటీన్లు, విటమిన్లు, పండ్లు, తాజా కూరగాయలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆదిత్య, శ్రీనివాస్, సీహెచ్‌ఓ శ్రీనివాస్, సువర్ణకుమారి, జయకుమారి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ నగేష్

వాటర్ ట్యాంకు ధ్వంసం



ధ్వంసం చేయక ముందు వాటర్ ట్యాంక్



ధ్వంసం చేసి పూర్తిగా తొలగించిన వాటర్ ట్యాంకు

పెద్దవూర : ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా తాగునీరు అందించే 5వేల లీటర్ల సామర్థ్యం ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును ధ్వంసం చేసిన ఘటన మండలంలోని కోమటికుంట తండాలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం ఇంటింటికి తాగునీటిని అందించే ఉద్దేశ్యంతో ఐదేళ్ల క్రితం ప్రభుత్వం తండాలో 5వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంకును నిర్మించింది. ఈ ట్యాంకు ద్వారానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తండావాసులకు తాగునీరు అందుతుంది. సోమవారం అర్ధరాత్రి దాటాక వాటర్ ట్యాంకును ధ్వంసం చేసి పూర్తిగా తొలగించారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలన్న సాకుతో ఎలాంటి అనుమతి లేకుండా రాత్రికి రాత్రే వాటర్ ట్యాంకును ధ్వంసం చేశారని తండావాసులు ఆరోపిస్తున్నారు. అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని తండావాసులు హెచ్చరిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



దేవరకొండ : పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

దేవరకొండ : నాగుల పంచమిని మంగళవారం దేవరకొండ పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. దేవరకొండ పట్టణంలోని ఆయా దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ శివారులో గల మార్కెండేయ స్వామి దేవాలయం వద్ద గల బ్రాహ్మణ ఎల్లమ్మ పుట్ట దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హాలియా : పట్టణంలోని మహిళలు నాగుల పంచమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు మహిళలు తెల్లవారుజామున వెళ్లి ఆలయం సమీపంలో ఉన్న పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు గోవర్ధనా రాఘవాచార్యులు పర్యవేక్షణలో పురోహితులు శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో దేవత పంచామృత అభిషేకం, అష్టోత్తర శత నామార్చనలు నిర్వహించారు.

నాగార్జునసాగర్ : శ్రావణ మంగళవారం పురస్కరించుకోని నందికొండ మున్సిపాలిటీలోని భక్తులు రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళగౌరి పూజలు చేశారు. ప్రత్యేకంగా ఎరుపు, పసుపువర్ణాల వస్త్రాలు ధరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేవారు. ఈ కార్యక్రమాలను ఆలయ అర్చకులు వెంకటాచార్యులు, శ్రీనివాస నర్సింహాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ కిషోర్, కార్యదర్శి కృష్ణ లుఎ నిర్వహించారు.



హాలియా : శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో..



నాగార్జునసాగర్ : సత్యనారాయణ స్వామి ఆలయంలో..

చింతపల్లిలో మైక్రో ఫైనాన్స్ ఆగడాలు

చింతపల్లి : మండలంలో మైక్రో ఫైనాన్స్ ఆగడాలు మితిమీరిపోతున్నాయి. పేదప్రజల అవసరాలను ఆసరాగా తీసుకొని మైక్రో కంపెనీకి చెందిన ఏజెంట్లు అధిక వడ్డీల వసూళ్లకు పాల్పడుతున్నారు. మంగళవారం మండల పరిధిలోని తిరుమలాపురంలో ఒక మహిళా మైక్రో ఫైనాన్స్‌లో రూ.50వేలు అప్పుగా తీసుకుంది. అప్పు ఇచ్చే సమయంలోనే రూ.5వేలు కట్ చేసుకొని రూ.45వేల నగదు అందజేశారు. 25నెలలకు గాను నెలకు రూ. 2550 చొప్పున 25నెలలు చెల్లించాలని తెలిపారు. ప్రతి నెలా 3న చెల్లించకపోతే అదనపు రుసుముతో పాటు చెల్లించాలి లేకపోతే ఏజెంట్లు ఇంటి వద్దకు వచ్చి మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. తిరుమలపురం గ్రామంలో 12మంది ఏజెంట్లు ఒకేసారి మహిళా ఇంటి వద్దకు వచ్చారు. దీంతో గ్రామస్తులు ఏజెంట్లను అడ్డుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైక్రో ఫైనాన్స్ ఆగడాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్ హేమలతకు నివాళి

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ హేమలత అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. దీంతో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి ఇతర ప్రజా ప్రతినిధులు హేమలత మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబుసాయిపేట మాజీ ఎంపీటీసీ గట్టు యాదగిరి, జంగిలి శ్రీనివాస్,భైరం రవి ఉన్నారు.

ఆగస్టు 8వరకు జీవాలకు టీకాలు

మిర్యాలగూడ టౌన్ : జీవాలకు ఆగస్టు 8వ తేదీ వరకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జీవి రమేష్ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ మండలం తడకమళ్ల, ఆలగడప, చింతపల్లి, పచ్చారిగడ్డ, వెంకటాద్రిపాలెం, గూడూరు, యాదగిరిపల్లి గ్రామాల్లో ఉచితంగా నీలి నాలుక వ్యాధి టీకాలను ఆయా గ్రామాల్లో 3,644 గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీలి నాలుక వ్యాధి ప్రధానంగా దోమకాటుతో వస్తుందని తెలిపారు. తొలుతగా జ్వరంతో ప్రారంభమై జీవాలు నడవలేని స్థితికి చేరుకుంటాయన్నారు. రైతులకు 75శాతం సబ్సిడీపై గడ్డీ విత్తనాలను ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలలో మిర్యాలగూడ సహాయ సంచాలకుడు జూలకంటి వెంకట్ రెడ్డి, మండల పశువైద్యాధికారులు నాయిని దుర్గా రమాదేవి, సీహెచ్ జ్ఞానేశ్వర ప్రసాద్, వీఎల్‌ఓ నజీర్, జేవీఓలు జానిపాష, నాగేందర్, రమ్య, నాగరాజు యాదవ్, శ్రీకాంత్, గోపాల మిత్రలు మట్టపల్లి సైదులుయాదవ్, చిర్ర మల్లయ్యయాదవ్ తదితరులున్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి మహిళా ఆత్మహత్యాయత్నం



వాటర్ ట్యాంకు ఎక్కిన మహిళ

చింతపల్లి : కుటుంబ తగాదాల కారణంగా ఒక మహిళా నీటి ట్యాంక్ ఎక్కి తనకు న్యాయం చేయాలనీ కోరుతూ ఆత్మ హత్య యత్నానికి ప్రయత్నించిన ఘటన మంగళవారం మండల పరిధిలోని వింజమూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వింజమూర్ గ్రామానికి చెందిన అరేకంటి లక్ష్మి దేవి కి వారి కుటుంబ సభ్యులకు మధ్య కొంత కాలం నుంచి భూ వివాదాలతో పాటు, ఆస్తి విషయంలో తనకు అన్యాయం జరుగుతుందని పలు మార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తనకు ఆస్తి విషయం లో న్యాయం చేయడం లేదని ఆరోపించింది. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంక్ ఎక్కి తనకు న్యాయం చేయాలని ఆత్మహత్యయత్నం చేసింది. దీంతో స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తనకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ట్యాంక్‌పై నుంచి కిందకు దిగింది.

'చలో మిర్యాలగూడ' ను విజయవంతం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి : చేయూత పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆగస్టు 1న చేపట్టనున్న చలో మిర్యాలగూడ విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ గుడిపల్లి మండల ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం గుడిపల్లి మండల కేంద్రంలో చేయుత పింఛన్‌ధారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మిర్యాలగూడలో పింఛన్ దారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నియోజకవర్గనాయకులు గోపాల్, మండల అధ్యక్షుడు గడ్డం నాగార్జున, మహేందర్, ఎర్ర యాదయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



హాలియా : మాట్లాడుతున్న మహమ్మద్ హాసన్



కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్

హాలియా : విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాల కోసం ముందుకు సాగాలని డాక్టర్స్ మహమ్మద్ హాసన్, డాక్టర్ యాదగిరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఐకాన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాలియా ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యం లో మంగవారం స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన యువ వికాస్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అపజయాలు విజయానికి సోపానాలని వివరించారు. యువత, విద్యార్థులు డ్రగ్స్, మద్యం, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాల కోసం శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వి మాధవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ కాంతయ్య, సీహెచ్ రాజు, విద్యార్థులు ఉన్నారు.

ఉన్నత పౌరులుగా ఎదగాలి

కొండమల్లేపల్లి : ఇంటర్మీడియట్ దశ విద్యార్థులకు కీలకమని, విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఉన్నత ఆశయాలను ఏర్పర్చుకోవాలని కొండమల్లేపల్లి ఎస్‌ఐ అజ్మీర రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ క్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. చెడు వ్యసనాలకు యువత గురికావద్దన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ శోక్, అంజనేయులు, ఏఓ గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది ప్రవీణ్, సంతోష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్, రమేష్, అధ్యాపకులు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

దేవరకొండ : దేవరకొండ గిరిజన గురుకుల మహిళా కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఎంపికల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. సోమవారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ మీట్ రాష్ట్ర స్థాయి ఎంపికలో కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికై బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రియ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినిలను అభినందించారు.

ఘనంగా సీత్లా పండుగ



బంజారా భవన్ వద్ద పూజలు చేస్తున్న గిరిజన మహిళలు

హాలియా : గిరిజన ప్రజల ఆనవాయితీగా, సాంప్రదాయ బద్ధంగా చిన్న పుష్యమి కార్తెలో జరుపుకునే సీత్లా పండుగ వేడుకలను హాలియా పట్టణంలోని బంజారా భవనం వద్ద గిరిజన మహిళలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుడియా బాబు పీఠాధిపతి ఆంగోతు భగవాన్ నాయక్, చంద్రుడు నాయక్, బానోతు సక్రునాయక్, పాండునాయక్, కుర్ర శంకర్ నాయక్, జవహర్ లాల్, అశోక్, నరేష్, సర్దార్, విజయ్, నాగేందర్, బద్దు, చిన్నా నాయక్, శోభన్‌బాబు, మహిళలు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధి నిధుల వినియోగంపై ఆడిట్

చింతపల్లి : ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, మోడల్‌స్కూళ్లకు సంబంధించిన పాఠశాలల అభివృద్ధికి విడుదలైన నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నీరుడు అంజయ్య తెలిపారు. తెలిపారు. ఆడిట్ అధికారులు స్నేహిత్, వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి వచ్చినటువంటి నిధులు పకడ్బందీగా ఆడిట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో చింతపల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రామావత్ లక్ష్మి, వీటీ నగర్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కృష్ణమ్మ తదితరులు హాజరయ్యారు.

బ్యూటీ అండ్ వెల్నెస్, హెల్త్ కోర్సులతో భవిష్యత్

మిర్యాలగూడ : వృత్తివిద్యా కోర్సులైన బ్యూటీ, వెల్నెస్, హెల్త్ కోర్సులు బాలికల బంగారు భవిష్యత్‌కు ఉపయోగపడుతాయని దామరచర్ల ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో భాగంగా మంగళవారం దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం ఆదర్శ పాఠశాలలో బ్యూటీ అండ్ వెల్నెస్ హెల్త్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునీక పరికరాలు, అత్యాధునిక సౌకర్యాలతో ప్రత్యేక శిక్షణ పొందిన ఇన్‌స్ట్రక్టర్లతో ఈ ల్యాబ్‌లు గ్రామీణ ప్రాంత పాఠశాలకు మంజూరు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరహరి, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్ కవిత, దుర్గా పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ సంఘర్షణ సైకిల్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : సంక్షేమ హాస్టల్ సంరక్షణ ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సంఘర్షణ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంఘర్షణ సైకిల్ యాత్ర పోస్టర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 30వ తేదీనుంచి ఆగస్టు 6వ తేది వరకు నిర్వహించే సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నల్లగొండలో ప్రారంభమై 33మండలాలు, ఆరు నియోజకవర్గాల్లో సైకిల్ యాత్ర సాగుతుందని.. చివరగా 6న మిర్యాలగూడ చేరుకుంటదని తెలిపారు. ఈ సందర్భంగా మిర్యాలగూడలో బహిరంగ సభ నిర్వహించడంతో సైకిల్ యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, నాయకులు న్యూమాన్, అనిల్, అజయ్, తరుణ్, కళ్యాణ్, కవిత, ప్రసన్న, నాగపుష్ప తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



సెల్ఫీ దిగుతున్న కుటుంబ సభ్యులు



నది ఒడ్డున చిన్నారి దరహాసం



సెల్ఫీ తీసుకుంటున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది



సాగర్ డ్యాంపై ప్రత్యేక కేంద్ర బలగాల బందోబస్తు